క్లుప్తంగా

పరస్పర సహకారంతో సేవలందిద్దాం



గుడివాడటౌన్: గుడివాడ పట్టణ నియోజకవర్గ ప్రజలకు పరస్పర అవగాహనతో సేవలందిద్దామని ఆర్డీఓ పి.పద్మావతి అన్నారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని డీఎస్పీ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, ఆర్డీఓ పద్మావతి డీఎస్పీ ఎస్.సత్యానందాన్ని కలిశారు. నూతనంగా బదిలీపై వచ్చిన సందర్భంగా డీఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసినట్లు ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్ తెలిపారు. శాంతి భద్రతలు, లా అండ్ ఆర్డర్ పర్యవేక్షణలో సమష్టి నిర్ణయాలు తీసుకుని ఉత్తమ సేవలందించేలా కృషి చేస్తామని అధికారులు చెప్పారు.

వైభవంగా కల్యాణోత్సవం



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శాంతి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారి జన్మనక్షత్రమైన కృత్తికా నక్షత్రం సందర్భంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్ర శర్మ ఆధ్వర్యంలో విశేష అలంకరణ జరిపి పూజలు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య, చైర్మన్ శొంఠి నాగరాజు విశేష పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

కొండిపర్రు(పామర్రు): దాతల సహకారంతో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేయటం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.మురళీకృష్ణ తెలిపారు. మండల పరిధి కొండిపర్రు గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ గుజవర్తి రామకృష్ణారెడ్డి సౌజన్యంతో 2021-22 ఏడాదిలో 7వ తరగతిలో ప్రథమ స్థానం సాధించిన పెదపూడి సుజాతకు రూ.3 వేలు, ద్వితీయ స్థానం సాధించిన డొక్కు యామినికి రూ.2 వేలను నగదు ప్రోత్సాహకంగా అందజేశారన్నారు.

యువకుని రక్తదానం

గుడివాడటౌన్: ఆపరేషన్‌కు రక్తం అవసరం కాగా భగత్‌సింగ్ బ్లడ్ డోనర్స్ గ్రూప్ సభ్యుడు స్పందించి రక్తదానం చేసినట్లు గ్రూప్ సభ్యులు సోమవారం తెలిపారు. పట్టణానికి చెందిన ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుడ్లవల్లేరుకు చెందిన పి లక్ష్మీ ప్రసన్నకు రక్తం అవసరం కాగా స్పందించిన గ్రూప్ సభ్యుడు చేదుర్తిపాటి వేణు రక్తదానం చేశారన్నారు. ఇప్పటికి వేణు 14 సార్లు రక్తదానం చేసినట్లు వారు పేర్కొన్నారు. రక్తదాతను అభినందించారు.

పాములపాడులో గ్రామసభ



పాములపాడు(పెదపారుపూడి): మండలంలోని పాములపాడు రెవెన్యూ పరిధిలో ఉన్న చేపల చెరువులను ఆక్వాజోన్‌గా మార్చుటానికి ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుందని గ్రామ ప్రత్యేకాధికారి, ఈఓపీఆర్డీ ఎం.నాగిరెడ్డి అన్నారు. మండలంలోని పాములపాడు సచివాలయం వద్ద చేపల చెరువుల రైతులకు సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ.. చేపల చెరువుల రైతులకు విద్యుత్ సబ్సిడీ, కిసాన్ క్రెడిట్‌కార్డు తదితర అంశాలను మత్స్యశాఖ అధికారులు తెలియజేస్తారన్నారు. కార్యక్రమంలో నాగాపురం సర్పంచ్ నాగదేశి సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి సాగరరాణి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు(కలిదిండి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. సర్పంచ్ మసిముక్కు మారుతీ ప్రసన్న, ఎంపీటీసీ సభ్యులు నీలి సుమన్, మహమ్మద్ సఫాయితుల్లా ఆధ్వర్యంలో కలిదిండిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం ఉత్సాహంగా జరిగింది. ముందుగా కలిదిండిలోని శ్రీపాతాళ భోగేశ్వరస్వామిని ఎమ్మెల్యే దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం మూడున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందిన కుటుంబాలకు కరపత్రాలను పంపిణీ చేశారు.

ప్రభుత్వ పాలనపై సంతృప్తి

ఎమ్మెల్యే ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో ప్రజల కోసం ఇన్ని పథకాలు ప్రవేశపెట్టిన సీఎంను ఇప్పటివరకు ఎవరూ చూడలేదన్నారు. ప్రజల్లో సీఎంకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. నియోజకవర్గంలో జరుగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ పాలనపై పూర్తి సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రతి చోటా క్రమం తప్పకుండా సంక్షేమ నిధులను పూర్తి పారదర్శకంగా బ్యాంకు ఖాతాలకు సీఎం పంపుతున్నారన్నారు. సాంకేతిక కారణాలతో పథకాలు రాకుంటే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, వైస్ ఎంపీపీ నాగలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షురాలు ఊర కల్యాణి, ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవికుమార్, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షేక్ చాన్ బాషా, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు గద్దె ఆనంద్, నాయకులు కందుల వెంకటేశ్వరరావు, నున్న కృష్ణబాబు, వడ్లాని పార్థసారథి, నున్న భగవానులు, చిట్టూరి బుజ్జి, నీలపాల వెంకటేశ్వరరావు, ఫ్రాన్సిస్, బలే నాగరాజు, తహసీల్దారు తేజోమణి, ఎంపీడీఓ సీతారాంకుమార్, ఎస్ఐ మణికుమార్, సెక్రటరీ ఉదయ్ కుమార్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



కలిదిండిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించటమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని రొయ్యూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రెండో రోజైన సోమవారం ఉత్సాహంగా జరిగింది. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే అనిల్‌కుమార్ గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి గత మూడున్నరేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించటంతోపాటు బ్రోచర్లను పంపిణీ చేశారు. స్థానికుల సమస్యలను తెలుసుకోవటంతోపాటు వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

టీడీపీవి దిగజారుడు విమర్శలు

పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ చెప్పారు. కులాలు, మతాలు, పార్టీలకతీతంగా అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీకి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక టీడీపీ అధినేత చంద్రబాబు, ఆ పార్టీ నాయకులు దిగజారుడు విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల అబద్ధాల ప్రచారాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరని పేర్కొన్నారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ జొన్నల రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ నిమ్మగడ్డ ప్రభుదాస్, మాజీ ఎంపీపీ కళ్లం వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మోర్ల రామచంద్రరావు, ఎంపీటీసీ దారం రోజారాణి, వైస్ ఎంపీపీ మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు నడకుదురు రాజేంద్ర, మోర్ల పూర్ణప్రసాద్, లుక్కా భరత్‌గౌడ్, లుక్కా విజయ్, చప్పిడి రాము, పంచాయతీ కార్యదర్శి శైలజ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



రొయ్యూరులో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

కుష్ఠు వ్యాధిపై అవగాహన అవసరం

పామర్రు: ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా లెప్రసీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గ్రామ సర్పంచ్ కేతావతు కస్తూరి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద మహాత్మ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుష్ఠు వ్యాధి రహిత సమాజమే లక్ష్యమన్నారు. గ్రామ కార్యదర్శి అబ్దుల్‌సలీమ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, పంచాయతీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కూచిపూడిలో అవగాహన..

కూచిపూడి(మొవ్వ): కుష్ఠు వ్యాధి గ్రస్తుల పట్ల సమాజంలో వివక్షత, చిన్న చూపును తొలగించాలని కూచిపూడి సర్పంచ్ కొండవీటి వెంకట రమణ విజయలక్ష్మి సూచించారు. మండలంలోని కూచిపూడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్పర్శలేని మచ్చలు, కుష్ఠు వ్యాధులపై అవగాహన కల్పించారు. తొలుత గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మహాత్ముని చిత్రపటానికి నివాళులర్పించారు హెల్త్ సూపర్‌వైజర్ బి.నాగేంద్రం, విజయ కుమారి, ఏఎన్‌ఎం డి.వసుంధర, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొని కుష్ఠు వ్యాధి లేని గ్రామంగా చేయాలంటూ ప్రతిజ్ఞ చేశారు.



కూచిపూడిలో వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి

అప్రమత్తత అవసరం

వెంట్రప్రగడ(పెదపారుపూడి): కుష్ఠు వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యుడు బీవీఆర్ సందీప్ అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ సచివాలయం వద్ద సోమవారం కుష్ఠు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డాక్టర్ సందీప్ మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి నివారణకు పీహెచ్‌సీలో ఉచితంగా మందులు ఇస్తున్నామన్నారు. సర్పంచ్ అప్పికట్ల ఆశాజ్యోతి, వైద్య సిబ్బంది వీవీఎస్ఎన్ మూర్తి, ప్రసాద్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కుష్ఠు రహిత సమాజానికి పాటుపడదాం

తోట్లవల్లూరు: కుష్ఠు రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని భద్రిరాజుపాలెం సర్పంచ్ కొక్కిలిగడ్డ హేమలత పిలుపునిచ్చారు. స్పర్శ కార్యక్రమంలో భాగంగా స్థానిక గ్రామ సచివాలయం వద్ద అవగాహన కార్యక్రమం సోమవారం జరిగింది. ఎంపీహెచ్‌ఈఓ మాణిక్యం కుష్ఠు వ్యాధి లక్షణాలు తెలియజేయటంతో పాటు నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కుష్ఠు వ్యాధి పక్షోత్సవాల్లో భాగంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఉప సర్పంచ్ చాగంటి తిరుమలరెడ్డి, పంచాయతీ కార్యదర్శి తవిరియా, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



భద్రిరాజుపాలెంలో ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ హేమలత, మాణిక్యం

చిన్నారి వైద్యానికి రూ.50 వేలు వితరణ

గుడివాడటౌన్: చిన్న వయస్సులోనే టీబీ బారినపడి అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారికి ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) రూ.50 వేలు వితరణగా అందజేశారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆయన నివాసంలో నియోజకవర్గానికి చెందిన పలువురు ఎమ్మెల్యేను కలిసి పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ చిన్నారి ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని తక్షణ సహాయంగా ఈ వితరణ అందజేశానని తిరిగి వైద్యం నిమిత్తం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. పలు సమస్యలపై వచ్చిన ప్రతి ఒక్కరి నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొడాలి నాని

జాతిపిత మహాత్మాగాంధీకి నివాళులు



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న భారత్ వికాస్ పరిషత్ సభ్యులు



మండవల్లిలో నివాళులర్పిస్తున్న సర్పంచ్ రూనీస్ తదితరులు

గుడివాడటౌన్: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పట్టణంలో పలు స్వచ్ఛంద సంస్థలు, పాఠశాలలు, కళాశాలలలో సోమవారం నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని గాంధీ విగ్రహానికి భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దండమూడి సీతారామస్వామి, చిన్నం గంగాధర్, కొల్లిపర సాయి సుబ్రహ్మణ్యం, బొగ్గారపు తిరుపతయ్య పాల్గొన్నారు. స్థానిక ఏఎన్నార్ కళాశాలలో గాంధీ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక జీవన్ పబ్లిక్ స్కూల్‌లో ఆర్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి జరిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ కె.రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గుడివాడ వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఏకేటీపీ మున్సిపల్ బాలికల పాఠశాల ప్రాంగణంలో గల ప్రాథమిక పాఠశాలలో గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ జిల్లా ఇన్‌చార్జి మోహన్‌బాబు, క్లబ్ అధ్యక్షుడు టీవీ సుబ్బారావు, పూర్వ అధ్యక్షుడు సూరే గాంధీ, ఉపాధ్యక్షుడు కె.లక్ష్మీ కాంతారావు, పైడి గోపాలకృష్ణ, ఎం.హనుమంతరావు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయ సాధనకు కృషి చేయాలి

మండవల్లి: మండలంలోని మండవల్లి, గన్నవరం, మొఖాసాకలవపూడి గ్రామాల్లో మహాత్మాగాంధీ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండవల్లిలో సర్పంచ్ మెండా రూనీస్ మాట్లాడుతూ.. గాంధీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కుష్ఠు వ్యాధిపై అవగాహన సదస్సులు నిర్వహించారు. నివారణ చర్యల్లో భాగంగా ప్రతిజ్ఞలు చేయించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్, హెల్త్ సూపర్‌వైజర్, పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇంటింటికీ వైద్య సేవలే ప్రభుత్వ లక్ష్యం

ఐనంపూడి(పామర్రు): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ ప్రభుత్వ వైద్య సేవలను అందించటమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని గ్రామ సర్పంచ్ భట్టు పరంజ్యోతి రాఘవ పేర్కొన్నారు. మండల పరిది ఐనంపూడి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రతి నెల ఐదో వారం సోమవారం నాడు గ్రామంలో ఇంటింటి వైద్య సేవల కార్యక్రమం జరుగుతోందన్నారు. వైద్యులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని తగు విధమైన ఆరోగ్య సూచనలు సలహాలతో పాటుగా మందులను అందజేస్తారని చెప్పారు. వైద్యులు గ్రామస్తులు, వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భట్టు వీర రాఘవులు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గణాంక శాస్త్రం భవిష్యత్‌కు బాట



మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

గుడివాడటౌన్: గణాంక శాస్త్రంలో పట్టు ఉన్న వారు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను చేరుకుంటారని కేంద్ర గణాంక సంస్థ ఏపీ రీజియన్ డెప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆర్.కిరణ్‌కుమార్ తెలిపారు. స్థానిక ఏఎన్నార్ కళాశాలలో సోమవారం స్టాటిస్టికల్ యాక్టివిటీస్ ఇన్ ద కంట్రీ అండ్ జాబ్ ప్రాస్పెక్ట్స్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ పాలసీలను గణాంకాల ఆధారంగానే రూపొందిస్తాయన్నారు. ఏ అంశంపైనైనా ఒక నిర్ణయం తీసుకోవాలంటే సంబంధిత విషయంలో గణాంకాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. విద్యార్థులు గణాంక శాస్త్రంపై పట్టు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో గణాంక శాస్త్ర విభాగ అధ్యాపకులు పి.శ్రీదేవి, ఎస్.రమేష్, కె.అపర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

తోట్లవల్లూరు: ఎస్టీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని కుమ్మమూరు గ్రామంలో యానాది తెగకు చెందిన తుపాకుల రామలక్ష్మి, తుపాకుల భవాని, ఏలూరి శివ, యాకశిరి వీరమ్మ గృహ నిర్మాణాలకు ఎస్టీ కార్పొరేషన్ నుంచి ప్రత్యేకంగా మంజూరైన నిధులను సోమవారం ఆయన పంపిణీ చేశారు. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి ఇచ్చే నిధులు రూ.1.80 లక్షలతో పాటు ఒక్కో లబ్ధిదారురాలికి రూ.63 వేల చొప్పున చెక్కులను ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అందజేశారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ జొన్నల రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ బొమ్మారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ కళ్లం వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మోర్ల రామచంద్రరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నడకుదురు రాజేంద్ర, హౌసింగ్ ఏఈఈ భవానీ ప్రసాద్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

సంక్షేమ పథకాల అమలుపై ఆరా

తోట్లవల్లూరు: సంక్షేమ పథకాల అమలుపై కేంద్ర బృందం ఆరా తీసింది. యాకమూరులో కేంద్ర మానిటరింగ్ బృందం సోమవారం పర్యటించింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు అమలు తీరుపై డీపీఎం రాజాగోవింద్, సభ్యులు పైడిరాజు, విజయ్ గ్రామ సచివాలయం వద్ద సమీక్ష జరిపారు. పథకాల అమలుపై లబ్ధిదారులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. ఉపాధి ఏపీడీ శ్రీలత, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, సర్పంచ్ గాదె కనకదుర్గ, ఎంపీటీసీ బి.రోజారాణి, వెలుగు ఏపీఎం కృష్ణంరాజు, పంచాయతీ కార్యదర్శి పూర్ణేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌ఐ నాగ కళ్యాణికి సత్కారం

పెదపారుపూడి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా చేతుల మీదగా ఉత్తమ ఎస్‌ఐ అవార్డును తీసుకున్న ఎస్‌ఐ పల్లా నాగకళ్యాణిని వైఎస్సార్ సీపీ మండల నాయకులు ఘనంగా సన్మానించారు. నాయకులు మాట్లాడుతూ.. ప్రజల కోసం కష్టపడి పని చేసే అధికారులకు ఎప్పుడు గుర్తింపు ఉంటుందన్నారు. ఎస్‌ఐకు అవార్డు రావటం చాలా సంతోషంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా యువజన కార్యవర్గసభ్యుడు నామా వెంకటేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ జాజుల చిన్నారి, పొనుగుమాటి సువర్ణరాజు, చిగురుపాటి శ్రీధర్, ఎం.అశోక్ పాల్గొన్నారు.



నేటి నుంచి సత్యదేవుని బ్రహ్మోత్సవాలు



గుడ్లవల్లేరు: సంతరోడ్డులోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివారి 70వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గుడివాడ సత్యనారాయణ గుప్తా తెలిపారు. 31న స్వామివారిని పెండ్లి కుమారుని చేయటంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు, ఒకటిన సత్యదేవుని సామూహిక వ్రతాలు, 2న స్వామివారి రాయబార మహోత్సవం, 3న 108కలశాలతో స్వామివారికి అభిషేకం, 4న స్వామివారికి గరుడోత్సవం, 5న వసంతోత్సవం, మహా పూర్ణాహుతి, చక్రస్నానం, స్వామివారి పవళింపు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలను జరుగుతాయని చెప్పారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లను ఏర్పాటు చేశామన్నారు. క్యూలైన్లతో పాటు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చైర్మన్ తెలిపారు. సత్యనారాయణ స్వామివారి ఆలయం రెండో అన్నవరంగా జిల్లాలో పేరు పొందింది. ఈ ఆలయానికి వందేళ్ల పైబడి చరిత్ర కలదు. స్వామివారికి ఏటా జరిగే బ్రహ్మోత్సవాల్లో జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొంటారు. అధికారులు, గ్రామస్తులు సమష్టిగా ఉత్సవాలు నిర్వహిస్తారు.

నాణ్యమైన వైద్య సేవలందించాలి

ముదినేపల్లి రూరల్: పీహెచ్‌సీలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలని ఎంపీపీ, ఆరోగ్య కేంద్ర అభివృద్ధి కమిటీ చైర్మన్ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. దేవపూడి పీహెచ్‌సీని ఎంపీపీ సోమవారం పరిశీలించారు. వైద్యుడు వినయ్, సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. సమయపాలన పాటిస్తూ రోగులకు మంచి సేవలందిస్తే ఆరోగ్య కేంద్రంపై సదాభిప్రాయం ఏర్పడుతుందన్నారు. పీహెచ్‌సీలో మందుల కొరత లేకుండా చూడాలని చెప్పారు. క్షేత్రస్థాయి సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ అంటువ్యాధులను గుర్తించాలని సూచించారు. ప్రభుత్వం వైద్య రంగానికి ప్రాధాన్యత ఇస్తోందని, ఇందుకు అనుగుణంగా వైద్యసేవలు అందించాలన్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులను అడిగి వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీకి సంబంధించిన వివరాలను వైద్యాధికారి వినయ్ ఎంపీపీకి తెలిపారు.



దేవపూడి పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న ఎంపీపీ రామిశెట్టి

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

కైకలూరు: హెల్మెట్ లేని ప్రయాణం ఎంతో ప్రమాదకరమని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కైకలూరు పట్టణ సీఐ ఎంవీఎస్ నాగరాజు చెప్పారు. జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాలతో కై కలూరు బస్టాండ్ సమీపంలో పలువురు వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై సోమవారం అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ.. హెల్మెట్ ధరించకపోవడంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని సర్వేలో తేలిందన్నారు. తల్లిదండ్రులు బిడ్డలకు వాహనాలు ఇచ్చినప్పుడు తప్పక హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించాలని సూచించారు. వేగం కన్నా ప్రాణం ముఖ్యమని ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. హెల్మెట్ ధరించని వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. టౌన్ మహిళా ఎస్‌ఐ గాయత్రి, సిబ్బంది పాల్గొన్నారు.



కైకలూరులో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నాగరాజు